క్లుప్తంగా

వరద బాధితులకు అండగా..



చెక్కు అందిస్తున్న పీఆర్ గవర్నమెంట్ కళాశాల గ్రౌండ్ యూజర్స్ అసోసియేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: విజయవాడ వరద బాధితులకు తమ వంతు సహాయం అందించేందుకు ముందుకు వచ్చిన పీఆర్ గవర్నమెంట్ కళాశాల గ్రౌండ్ యూజర్స్ అసోసియేషన్ సభ్యుల సేవలు అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం అన్నారు. వరద బాధితుల సహాయం కోసం యూజర్స్ అసోసియేషన్ సభ్యులు సీఎం సహాయ నిధికి రూ.లక్షా116 చెక్కును ప్రిన్సిపాల్‌కు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పంపన సాయి, తలాటం హరీష్ మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యుల సహకారంతో ఈ మొత్తం విరాళంగా అందించామన్నారు. కార్యక్రమంలో సభ్యులు ముప్పన పురుషోత్తం, సురేష్, వర్మ, చంద్రు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

కాకినాడ రూరల్: చీడిగ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శ్రీకిరణ్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్తిబాబు దంపతులు సందర్శించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి బాపిరాజు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధుడు అడవి బాపిరాజు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ సహాయ నిరాకరణ ఉద్యమంలో ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించిన బాపిరాజు పలు చిత్రాలకు దర్శకత్వం వహించడంతో పాటు 100కు పైగా రచనలు చేశారన్నారు. 1952 సెప్టెంబరు 22న ఆయన మరణించారన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, సీహెచ్ వెంకట్రావు, కుమార యాదవ్, రెడ్నం రాజా, రాఘవరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజన్ ప్లాన్‌లో భాగస్వాములు కండి

కాకినాడ సిటీ: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వికసిత్ భారత్‌లో భాగంగా ప్రభుత్వం స్వర్ణాంధ్రా 2047 విజన్‌కు శ్రీకారం చుట్టిందని కలెక్టర్ షణ్మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా ఆర్థిక, సామాజికాభివృద్ధి, పర్యావరణ, సుస్థిరతలపై దృష్టి సారిస్తూ ప్రధాన వృద్ధి కేంద్రంగా మార్చడానికి కావాల్సిన కార్యాచరణ ప్రణాళిక నిర్దేశించిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్ రూపకల్పనలో భాగస్వామ్యం కావాలని జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు కోరుతుందన్నారు. ఈ విజన్ సభల్లో పాల్గొని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తమ సూచనలు, అభిప్రాయాలను నమోదు చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

సేవలు అభినందనీయం



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నానాజీ, బాలకృష్ణ

బాలాజీచెరువు: రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ (1978) ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. స్థానిక ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం గౌరవ అధ్యక్షుడు బాదం బాలకృష్ణ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు రూ.2.60 లక్షల విలువైన ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా ప్రతి ఏడాది రూ.15 లక్షలతో పేదలకు విద్య, వైద్య రంగాల్లో సహాయం చేస్తున్నామన్నారు. గత ఎనిమిదేళ్లలో రూ.75 లక్షల విలువైన కార్యక్రమాలు చేపట్టామని, విద్యార్థులకు ఉపకార వేతనాలతో పాటు సైకిళ్లు, మహిళలకు కుట్టు మెషీన్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జగన్నాథరావు, జనార్దన్, సురేష్, రెడ్నం రమణ, అరుణకుమార్, మధుసూదన్ పాల్గొన్నారు.

త్వరలోనే రేషన్ కార్డులు

కాకినాడ రూరల్: ప్రభుత్వం త్వరలోనే రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపడుతుందని రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధి నగరంలోని అర్బన్ డివిజన్లకు సంబంధించి స్థానిక 2వ డివిజన్‌లోని కోటయ్య కన్వెన్షన్ వద్ద ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ త్వరలో పుంత రోడ్లను రూ.11 కోట్లతో నిర్మిస్తామన్నారు. కాకినాడ బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. కాకినాడలో ఐపీఎల్ స్టేడియం నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమానికి ప్రజలు అంతంత మాత్రంగానే హాజరయ్యారు.

ఫ్లెక్స్ ఫ్రీ సిటీ ఎక్కడ?

- అమలులో అధికారులు విఫలం
- జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- ప్రమాదాలకు నిలయంగా మారుతున్న వైనం



ఇంద్రపాలెం బ్రిడ్జి సమీపంలో అంబేద్కర్ విగ్రహం సగం కనిపించకుండా కట్టిన ఫ్లెక్సీలు

బోట్‌క్లబ్: ఫ్లెక్సీ.. ఈ మాట చిన్నగా ఉన్నా, ఇవి తెచ్చే ప్రమాదాలు అన్నీ ఇన్నీకావు.. పుట్టినరోజు వేడుకైనా, పెళ్లయినా, విషాద కార్యక్రమం, నాయకుల హంగామాలు, ఇలా ఏదైనా రోడ్డు పక్కన చిన్న జాగా దొరికితే చాలు ఎవరి ఇష్టమొచ్చినట్లు వారు ఫ్లెక్సీలు కట్టేస్తున్నారు. దీని కారణంగా రోడ్డు ఒకవైపు నుంచి మరోవైపు వెళ్లే ప్రయాణికులకు వచ్చే వాహనాలు తెలియక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కాకినాడ నగరంలో దాదాపు ఏ వీధి చూసినా ఫ్లెక్సీలు అనేకం కనిపిస్తున్నాయి. పోనీ ఈ ఫ్లెక్సీల వల్ల కార్పొరేషన్‌కు ఏదైనా ఆదాయం వస్తుందా అనుకుంటే పొరపాటే. ఏ ఒక్క వ్యాపార సంస్థ కానీ, వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు కానీ ఎటువంటి అనుమతి తీసుకోకుండా ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు పెట్టేస్తున్నారు. దీంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. స్థానిక సర్పవరం జంక్షన్ మొదలు బోట్ క్లబ్, నాగమల్లితోట, భానుగుడి, టూ టౌన్ బ్రిడ్జి, మెయిన్ రోడ్డు, మసీద్ సెంటర్, జగన్నాథపురం వరకూ ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. వీటిని నిరోధించాల్సిన కార్పొరేషన్ సిటీ ప్లానింగ్ విభాగం చోద్యం చూస్తోంది. అదే ప్రతిపక్ష నాయకులు ఎవరైనా ఎక్కడైనా ఫ్లెక్సీలు కడితే మాత్రం వాటిని వెంటనే తొలగిస్తున్న అధికారులు, కూటమి నాయకులు మాత్రం నిబంధనలు పాటించకుండా విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు కడుతున్నా వాటిని మాత్రం తొలగించడం లేదు. నగరంలో వారంలో రెండు రోజులు ఏదొక కొత్త వ్యాపార సంస్థ కొత్త దుకాణం ఏర్పాటు చేయడం సర్పవరం జంక్షన్ మొదలుకొని ఆయా వ్యాపార సంస్థ ప్రాంతం వరకూ వందల కొద్దీ ఫ్లెక్సీలు పెడుతుండడం జరుగుతుంది. ప్రమాదకర మలుపులున్న ప్రాంతాల్లో సైతం కనిపించకుండా ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో ఉన్న జాతీయ నాయకుల విగ్రహాల వద్ద ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు కడుతున్నారు.



టూ టౌన్ బ్రిడ్జిపై ఫ్లెక్సీలు కడుతున్న సిబ్బంది



బాలాజీచెరువు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన అనధికార ఫ్లెక్సీలు

ఆ ఆదేశాల మాటేమిటో?

నగరాన్ని ఫ్రీ ఫ్లెక్సీ సిటీగా ప్రకటించి జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేకాధికారి షణ్మోహన్ సగిలి జూలై 19న ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు పక్కన ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు కట్టడంతో ప్రమాదాలు జరుగుతున్న విషయం తెలుసుకొని నగరంలో పలు ప్రధాన ప్రాంతాలను ఫ్రీ ఫ్లెక్స్ సిటీగా ప్రకటించారు. స్థానిక సర్పవరం జంక్షన్ నుంచి భానుగుడి సెంటర్ వరకూ, టూ టౌన్ నుంచి జగన్నాథపురం వరకూ, కోకిలా సెంటర్ నుంచి సినిమారోడ్డు, వన్ టౌన్ స్టేషన్ వరకూ కలెక్టర్ ఫ్రీ ఫ్లెక్సీ సిటీగా ప్రకటించారు. నిబంధనలు అతిక్రమిస్తే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఇది జరిగి రెండు నెలలు కావొస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ ఆదేశాల అమలులో పూర్తిగా విఫలమయ్యారు. అధికార పార్టీ ఫ్లెక్సీలతోపాటు, వ్యాపార, వాణిజ్య, వ్యక్తిగత ఫ్లెక్సీలు ఆయా ప్రాంతాల్లో ఇష్టానుసారంగా కడుతున్నా అడిగేవారు లేకుండా పోయారు. నగరంలో ఉన్న టూటౌన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి, ముత్తా వారధి, వైఎస్సార్ వారధి, కల్పనా బ్రిడ్జిపై ఫ్లెక్సీలు ఇబ్బడిముబ్బడిగా కనిపిస్తున్నాయి.

నిబంధనలు గాలికి..

నగరంలో ఎక్కడైనా ఫ్లెక్సీలు పెట్టుకోవాలంటే కార్పొరేషన్ అధికారుల అనుమతులు తీసుకోవాలి. ఎవరైనా నిబంధనలు గాలికొదిలేసి ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే సంబంధింత వ్యాపార సంస్థ నుంచి అపరాధ రుసుం వసూలు చేసే అధికారం అధికారులకు ఉంది. కానీ నగరంలో నిబంధనలను వారే గాలికొదిలేశారు. ఎటువంటి అపరాధ రుసుం వసూలు చేయకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు.

వెంటనే అమలు చేయాలి



కాకినాడను ఫ్రీ ఫ్లెక్స్ సిటీ చేస్తున్నామని ప్రకటించి నెలలు కావొస్తున్నా ఇంకా అమలు చేయలేదు. కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదంటే వారు ఏ విధంగా పనిచేస్తున్నారో చెప్పాల్సిన అవసరం లేదు. గాలులు వేసినప్పుడు ఫ్లెక్సీలు బైక్‌లపై వెళ్లేవారిపై పడి ప్రమాదాలు బారిన పడుతున్నారు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారో కార్పొరేషన్ అధికారులు సమాధానం చెప్పాలి.

–దూసర్లపూడి రమణరాజు, పౌరసంక్షేమ సంఘం కన్వీనర్

కొత్త కార్యవర్గం ఎన్నిక

కాకినాడ సిటీ: మహర్షి సాంబమూర్తి సామాజిక అభివృద్ధి విషయాల అధ్యాయన సంస్థ 34వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక మహర్షి సాంబమూర్తి వికలాంగ బాలికల ఆశ్రమ పాఠశాల ఆవరణలో జరిగింది. సమావేశంలో సంస్థ కార్యదర్శి వీవీఎస్ఎన్ మూర్తి వార్షిక నివేదిక సమర్పించగా, కోశాధికారి కె.శ్రీనాథ్ 2023–24 సంవత్సర అకౌంట్ నివేదిక సమర్పించారు. ఈ సభలో 2024–26 సంవత్సరానికి సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంస్థ గౌరవ అధ్యక్షుడిగా వైడీ రామారావు, అధ్యక్షుడిగా మహమ్మద్ జవహర్ అలీ, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, సయ్యద్ సలార్, కార్యదర్శిగా డీవీఎస్ మూర్తి, సంయుక్త కార్యదర్శులుగా అల్లూరి సురేంద్ర, ఎస్ఎస్ఆర్ జగన్నాథం, కోశాధికారిగా కె.శ్రీనాథ్, సభ్యులుగా వీఎల్ గాంధీ, వీవీవీ ప్రసాద్, వాసా సత్యనారాయణ, కరకా వెంకటేశ్వరరావు, శ్రీదేవి, వీవీ సత్యనారాయణ తదితరులు ఎన్నికయ్యారు.

ఎన్ఎస్ఎస్‌తో దేశభక్తి

బాలాజీచెరువు: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)తో దేశభక్తి పెరుగుతుందని మానికిరెడ్డి హెల్త్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ మానికిరెడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఆదివారం జాతీయ సేవా పథక ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రాధాన్యాన్ని వివరించారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు కళాశాల ఆధ్వర్యంలో సమీప దత్తత గ్రామాలను తీసుకుని ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ తేజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూతురే ఇంటికి మహాలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా బాలల సంక్షేమాధికారి వెంకట్రావు

కాకినాడ రూరల్: కూతురే ఇంటికి మహాలక్ష్మి అని, వారి పట్ల ప్రేమానురాగాలు చూపాలని జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు అన్నారు. జాతీయ కుమార్తెల దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆడపిల్లలను భారంగా చూస్తుండగా, ఇతర దేశాల్లో సంబరాలు చేసుకుంటున్నారన్నారు. మన దేశంలో ఒకప్పుడు ఆడపిల్ల అంటే ఎంతో భారంగా పరిగణించేవారని, నేడు వారిని మహాలక్ష్మిగా గౌరవిస్తున్నారన్నారు. వాస్తవంగా మగ పిల్లలు కంటే ఆడపిల్లలే కుటుంబం పట్ల ప్రేమానురాగాలు చూపుతారన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రెడ్నం రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతానికి పిలుపు



కుల జనగణనపై వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

కాకినాడ సిటీ: అధిక జనాభా కలిగిన బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా వాడుకుంటూ అగ్రవర్ణాలు అధికారాన్ని పొందుతున్నాయని, కుల జనగణనపై అక్టోబర్ 9న విజయవాడలో జరగబోయే ధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు భక్కా పరంజ్యోతి పిలుపునిచ్చారు. ఆదివారం కాకినాడలో కుల జనగణనపై జిల్లా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ సంఘాల నాయకులు, కుల పెద్దలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనికి బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సుబ్బుభాయ్ అధ్యక్షత వహించగా, మాజీ ఎమ్మెల్యే లక్కీ రాజారావు, బీసీ సంఘాల నాయకులు చొల్లంగి వేణుగోపాల్, పప్పు దుర్గాప్రసాద్, వీవీఎస్ గోపాలకృష్ణ, గుడిమెట్ల వీర్రాజు, చెల్లూరి సత్యనారాయణ, పౌర సంఘం కాకినాడ అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు కుల జనగణనపై మాట్లాడారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సబ్బారపు అప్పారావు, కండివెల్లి లోవరాజు, సాధానాల రాజు, బుంగ చక్రవర్తికామరాజు, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కుల జనగణనపై ముద్రించిన వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు.

జ్యూట్ బ్యాగుల పంపిణీ




అందించిన జ్యూట్ బ్యాగులతో ఆర్టీసీ సిబ్బంది

కాకినాడ సిటీ: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం అఖిల భారత స్త్రీ సమాఖ్య సౌజన్యంతో ఓఎన్‌జీసీ వారి సహకారంతో ఆర్టీసీ సిబ్బందికి జ్యూట్ బ్యాగులు అందజేశారు. అఖిల భారత స్త్రీ సమాఖ్య నాయకురాలు భానుమతి, ఓఎన్జీసీ ఉద్యోగి అన్వర్, కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ తదితరులు పాల్గొని జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు.

పీఎం స్వనిధిపై అవగాహన

కాకినాడ సిటీ: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని స్టేట్ బ్యాంకుల బ్రాంచ్‌ల్లో ఆదివారం పీఎం స్వనిధి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద తెలిపారు. ఈ కార్యక్రమాల్లో లబ్ధిదారులు పాల్గొని రుణమేళాను వినియోగించుకున్నారన్నారు. ఎస్‌బీఐ ఆర్ఎం దహెరి, ప్రసాద్, సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకటరావు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు, ఆర్పీలు, ఎస్‌బీఐ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీగా శ్రీహరిరాజు బాధ్యతల స్వీకరణ



పెద్దాపురం: పెద్దాపురం డీఎస్పీగా శ్రీహరిరాజు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకూ ఇక్కడ డీఎస్పీగా పని చేసిన కె.లతాకుమారి విజయవాడకు రిపోర్ట్ చేయాలని ఆదేశాలు రావడంతో ఆమె స్థానంలో రాజమహేంద్రవరం ఏసీబీ డీఎస్పీగా పని చేస్తున్న శ్రీహరిరాజును ఇక్కడ నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆదివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. తొలుత సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు మర్యాద పూర్వకంగా ఆయనను కలుసుకుని పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

30 వరకూ రైల్వేగేటు మూసివేత

సామర్లకోట: రైల్వే ట్రాకు మరమ్మతుల దృష్ట్యా ఉండూరు రైల్వే గేటును సోమవారం నుంచి 30వ తేదీ వరకూ మూసి వేస్తామని సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రామసుబ్బారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే గేటు మూసి వేసిన కారణంగా సామర్లకోట నుంచి ఉండూరు, అచ్చంపేట వెళ్లే వాహనాలు అచ్చంపేట ఏడీబీ రోడ్డు మీదుగా మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సామర్లకోట పోలీసులకు, మున్సిపల్ కమిషనర్‌కు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చామని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలన్నారు.

ఎమ్మెల్యే నానాజీపై చర్యలు తీసుకోవాలి



ఎమ్మెల్యే నానాజీపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్న కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘ నాయకులు

కాకినాడ సిటీ: కాకినాడలో శనివారం రాత్రి రంగరాయ వైద్య కళాశాల మైదానంలో దళిత ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావుపై దాడి చేసిన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీపై చర్యలు తీసుకుని, కేసు నమోదు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కాకినాడ సుందరయ్య భవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేబీ సురేష్‌కుమార్, కె.సింహాచలం, కె.సత్యానందం మాట్లాడుతూ పంతం నానాజీ ఎమ్మెల్యేనన్న స్పృహ కోల్పోయి రంగరాయ మెడికల్ కళాశాల దళిత ప్రొఫెసర్‌పై నానా దుర్భాషలాడుతూ, చంపేస్తానంటూ డాక్టర్ ముఖంపై ఉన్న మాస్క్‌ను లాగేసి దాడి చేయడం దారుణమన్నారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన మేనల్లుడు, అనుచరులు టార్చ్‌లైట్లు వేసి దాడి చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికార అండతో ఎమ్మెల్యే నానాజీ చెలరేగడం మంచిది కాదన్నారు. అహంకారంతో ఊగిపోయి దాడి చేసిన వారిపై జిల్లా అధికారులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

దాడిపై సమగ్ర విచారణ జరపాలి: సీపీఎం

ఆర్ఎంసీ స్పోర్ట్స్ వైస్ చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వరరావుపై ఎమ్మెల్యే పంతం నానాజీ దుర్భాషలాడి, చేయి చేసుకోవడం అత్యంత దారుణమని సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. గౌరవ ఎమ్మెల్యే స్థానంలో ఉండి దురుసుగా ప్రవర్తించడం, ఆయన అనుచరులు భౌతిక దాడి చేస్తున్నా నిరోధించకపోవడం సరైన పద్ధతి కాదని రాజశేఖర్ అన్నారు. కొంత మంది జూనియర్ డాక్టర్లపై కూడా దాడి చేయడం చూస్తుంటే, రౌడీయిజం చేస్తామని, తమకు అడ్డు ఏంటనే అహంకారం ఉందన్నారు. ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజశేఖర్ డిమాండ్ చేశారు. బాధిత డాక్టర్, జూనియర్ డాక్టర్లు, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సమక్షంలో ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా కంప్లెయింట్ రిజిస్టర్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తుందని అన్నారు. ఎమ్మెల్యే పంతం నానాజీ క్షమాపణ చెప్పడం మంచిదేనని, ఇక్కడితో అయిపోయిందని కాకుండా దాడి చేసిన వారికి శిక్ష పడేలా చేయాలన్నారు.

రంగరాయ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావుపై ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆయన అనుచరులు దాడి చేయడం దురదృష్టకరమని సామాజిక న్యాయ సాధన సమితి డిమాండ్ పేర్కొంది. ఈ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ భానుమతి, నవీన్‌రాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ మోకా పవన్‌కుమార్, ముఖ్య సలహాదారులు, న్యాయవాది జవహర్ అలీ, అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే నానాజీ తన స్థాయిని మరిచి ఇలాంటి చర్యలకు పాల్పడడం అత్యంత హేయమైన చర్య అన్నారు. కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌లు ఈ సంఘటనపై సీరియస్‌గా వ్యవహరించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ఐ ఎంపికలు



పరుగు పందెం పోటీలో పాల్గొన్న బాలురు



లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారుడు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక జిల్లా క్రీడా మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్ఐ) కాకినాడ అర్బన్ నియోజకవర్గ ఎంపికలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ ఎంపికలను అర్బన్ ఎస్‌జీఎఫ్ఐ పోటీల ఇన్‌చార్జి పట్టాభి, జిల్లా కార్యదర్శి జార్జి ప్రారంభించారు. అండర్–14, 17 విభాగాల్లో బ్యాడ్మింటన్, రన్నింగ్, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్, డిస్క్‌త్రో, యోగా విభాగాల్లో ఎంపికలు జరిగాయి. అర్బన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ ఎంపికల్లో పాల్గొని తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి పట్టాభి మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని, విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. ఎంపికల నిర్వహణలో పీడీలు శ్రీను, సూర్యనారాయణ, సతీష్, పద్మ, రమ, మౌనిప్రసాద్ పాల్గొన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన వారు త్వరలో ఎస్‌జీఎఫ్ఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగే పోటీలకు హాజరవుతారని పట్టాభి తెలిపారు.

సామాజిక సేవలతో సంతృప్తి



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న బాదం బాలకృష్ణ

బోట్‌క్లబ్: లోకల్ బిజినెస్ నెట్‌వర్క్ ప్రారంభించి వ్యాపార అభివృద్ధితో పాటు, వచ్చిన లాభంలో సామాజిక సేవలు చేయడం సంతృప్తిని ఇస్తుందని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక జగన్నాథపురంలో లోకల్ బిజినెస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. యువత లోకల్ బిజినెస్ నెట్‌వర్క్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమాజ సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావాలన్నారు. నెట్‌వర్క్ అధ్యక్షులు అంకుర్ సురాన మాట్లాడుతూ ఈ రక్తదాన శిబిరంలో వంద బ్లడ్ ప్లాకెట్లను అందించనున్నట్లు చెప్పారు. సభ్యుల సహకారంతో మరిన్ని సేవలు చేపడతామన్నారు. నెట్‌వర్క్ సెక్రటరీ సతీష్ కుమార్, ట్రెజరర్ సిరాజ్, ఉపాధ్యక్షుడు పి.రవితేజ, రోటరీక్లబ్ ఎలెక్టెడ్ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి, రెడ్ క్రాస్ చైర్మన్ వైడీ రామారావు పాల్గొన్నారు.

క్వాలిటీ కేర్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎంపీ



క్వాలిటీ కేర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కాకినాడ భానుగుడి సెంటర్ సమీపాన చింతావారి వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్వాలిటీ కేర్ ల్యాబ్‌ను ఆదివారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలతో కచ్చితత్వమైన వైద్య పరీక్షలు అందించేందుకు వీలుగా క్వాలిటీ కేర్ ల్యాబ్ ఏర్పాటు చేయడం ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగమన్నారు. హైదరాబాద్, చెన్నై, ముంబయి వంటి మహానగరాలకే పరిమితమైన కొన్ని రకాల వైద్య పరీక్షలు ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. ల్యాబ్ సదుపాయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ల్యాబ్ ఎండీ పి.రవీంద్ర కోరారు. కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొన్నారు.

హామీలను ప్రభుత్వం అమలు చేయాలి



కార్మిక మహాసభలో మాట్లాడుతున్న శేషబాబ్జీ

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్వా శేషబాబ్జీ డిమాండ్ చేశారు. సామర్లకోట సీపీఎం కార్యాలయంలో జరిగిన కార్మిక శాఖ మహాసభలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. తల్లికి వందం, ఉచిత గ్యాస్ సిలిండర్, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి హామీలను అమలు చేయాలన్నారు. ఏలేరు ఆధునీకరణ చేసి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వర్షాలు వచ్చిన ప్రతి సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం కార్మిక శాఖ కార్యదర్శిగా విప్పర్తి కొండలరావును ఎన్నుకున్నారు. ఈ మేరకు కొండలరావు మాట్లాడుతూ పిఠాపురం, కాకినాడ, రాజానగరం రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇసుక కొరత కారణంగా కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని ఆరోపించారు. కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు కనీస వేతనం రూ.21 వేలు అమలు చేయాలన్నారు. స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కరణం ప్రసాదరావు, ఆ పార్టీ నాయకులు బాలం శ్రీనివాసు, నవర సురేష్‌కుమార్, బాలం సత్తిబాబు, చల్లా మహేష్, బాలం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.